# బేడా కాసులు ఆదా

"నాన్నా. కృష్ణలీలలు సినిమా చూడవద్దూ?"

"ఉండరా. ఒకటేగోలా!... అయితే, భారసాలకు అందర్నీ పిలవాలిసినదేటే? వాళ్లకు బట్టలూ అవీ కూడా పెట్టొద్దూ?"

"బాగుందే, వాళ్లంతా పిల్లలకు ఏవైనా చదివిస్తే అవన్నీ తీసుకుని ఊరుకుంటే ఏం బాగుంటుంది?"

"ఆఁ! చదివింపులు! గళ్ల రుమాలాలూ, సిల్కు చేతిగుడ్డలూ చదివించిన వాళ్లందరికీ బట్టలు పెడుతూ కూర్చుంటే – చేతులో తడిలేదు."

"అయితే మానెయ్యండి, నాకేం?"

"అవును నీకేం! మాటపడేది నేనేగా!"

"అందుకనే నలుగుర్నీ పిలవండీ, అన్నాను."

"మంచిపని చేశావు!"

❀ ❀ ❀ ❀ ❀

మంచి సినిమా, నాన్నా! అంతా వెళుతున్నారు, నాన్నా!"

"ఉండరా, ఒకటేగోలా!... మాట్టాడవేమే? చౌకలో పోతుంది. ఏటవతల సంబంధం చూస్తాముటే?"

"ఇంకో ఐదువందలకు లోపిస్తారుటండీ! ఊళ్ళోవాడూ. చదువుకున్న వాడూ ఉండగా. ఇంకొంచెం ఆస్తి ఉందిగదా అని పిల్లదాన్ని ఏటవతల ఇచ్చుకుంటే మీరాదాచేసే అయిదువందలూ తిరగటానికి సరిపోదూ?"

"ఏం తిరగటమో! చేతులో తడిలేదు."

"అయితే మానెయ్యండి, నాకేం?"

"అవును నీకేం? మాటపడేది నేనేగా!"

"అందుకనే ఊళ్లో సంబంధం చెయ్యండీ అన్నాను."

"మంచిపని చేశావు!"

❀ ❀ ❀ ❀ ❀

ఇవాళ సినిమా ఆఖర్రోజు, నాన్నా! పులులూ, సింహాలూ - మంచి సినిమా, నాన్నా!"

"ఉండరా, ఒకటే గోలా!... చెప్పవేమే? ఇల్లమ్ముదామా. పొలమమ్ముదామా? రెంటికీ ఒకటే ధర వచ్చేట్టుంది. కాకపోతే, ఇంతకన్న మనకు పొలం మీదే ఎక్కువ గిట్టుబాటవుతున్నది.

"అందుకని ఇల్లులేకుండా చేసుకుంటారంటీ? మన నట్టింట మనం తినక మాడినా ఎవరికీ తెలీదు. ఇల్లూ వాకిలీ లేక చెట్టూ పుట్టా పట్టిపోతే మనకు పొలం ఉందని మన్నించే దెవరండీ?"

"ఎవరో అనుకుంటారని నష్టపడతాముటే? కొంపకేం? అయిదు రూపాయలు పారేస్తే ఏ వసారా అయినా దొరక్కపోదు. గంగగోవంటి భూమి–"

"అయితే మీ యిష్టమొచ్చినట్టు చెయ్యండి. నాకేం?"

"అవును నీకేం? మాటపడేది నేనేగా?"

"అందుకనే పొలం అమ్మండీ అన్నాను."

"మంచిపని చేశావు!"

❋ ❋ ❋ ❋ ❋

"సినిమాకు పోవద్దు, నాన్నా?"

"బంగారమంటి పొలం కాస్తా పోయింది. ఇంకా సినిమా ఏమిట్రా, వెధవా? జరిగిందంతా సినీమా కాదూ?"

*ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942*
*యువ కార్యాలయం, తెనాలి*